# శ్రీధర కథలు

ఎండమండి పోతోంది. ఎండ తాకిడికి భయపడి ఎవరూ బయటకు రావటం లేదు. రోడ్లు దాదాపు నిర్మానుష్యంగా ఉన్నాయి.

విశాల మాత్రం భారంగా అడుగులు వేస్తూ, బరువుగా ఉన్న సంచినీ ఈ చేతి నుంచి ఆ చేతికి మార్చుకుంటూ, కారుతున్న చెమటను తుడుచుకుంటూ.... ఇంటింటి ముందూ ఆగి గేటు చప్పుడు చేసి ఇంట్లోంచి ఎవరైనా తొంగి చూస్తే ఆశగా అడుగుతోంది–

''సబ్బులు తీసుకుంటారా మేడమ్, కొత్తగా నిన్నే మార్కెట్‌లోకి రిలీజు అయ్యాయి.... అది కాదు మేడమ్, ఆఫర్ ఉంది...''

# కుక్క ఉన్నది జాగర్త

వద్దన్న శబ్దంతో పాటు ''ఫో, ఫో'' అన్న చీదరింపూ వినిపిస్తోంది. బాధపడుతోంది. ఒక బాధ అయితే ఓర్చుకోవచ్చు. మండే ఎండతో బాధ, తడారిపోయిన గొంతు తడుపుకునే దారి లేక బాధ, తెగిన చెప్పుకు కొట్టిన మేకు బొటనవేలికి గుచ్చుకుని బాధ... 'ఫో.. ఫో' అని బిచ్చగాణ్ణి తరిమి నట్లు తరుముతున్నందుకు బాధ. ఇన్ని బాధలు భరిస్తూ చిరునవ్వును పెదాలకు అతికించుకుని చెబుతోంది. 'ఆఫర్ ఉంది మేడమ్... రెండు కొంటే ఒకటి ఫ్రీ....'

కాలింగ్ బెల్ నొక్కింది. రెండు నిముషాల తరువాత ఒక వయసు మళ్లినావిడ తలుపుతీసి 'ఎవరు నువ్వు?' అని కంటి చూపుతోనే ప్రశ్నించింది.

''సబ్బులు తీసుకుంటారా, మేడమ్ మార్కెట్‌లోకి కొత్తగా వచ్చాయి...'' అని అడిగింది విశాల.

''ఏహె... ఫో... కొంపలంటుకుపోయినట్లు కాలింగ్‌బెల్ నొక్కి, బంగారంలాంటి నిద్ర చెడ గొట్టావు... మధ్యాహ్నం ఒక గంట నడుం వాలుద్దామంటే ఉండదు.. నిముషానికొకడొచ్చి తలుపు కొడతారు..... వెధవ గోల..'' అంటూ మొహాన తలుపు వేసింది.

నిజమే... ఆమెను నిద్ర లేపాల్సినంత ముఖ్యమైన విషయం కాదు.. కానీ... విశాల ప్రాబ్లమ్ వీళ్లకి అర్థం కాదు. ఇంటింటికీ తిరిగి అమ్మాలి. కొనవల్సిన ఇంటావిడ పది గంటలదాకా వంటింట్లో బిజీ... పదకొండూ పన్నెండూ మధ్య భోజనాలు... కంచం ముందు నుంచి లేపినందుకు తిడతారు. పన్నెండింటి నుంచీ మూడింటిదాకా నిద్ర. ఆ తర్వాత కాఫీలు, టిఫెన్లు, స్కూలు నుంచి వచ్చే పిల్లల మంచీ చెడూ చూడటంతో బిజీ... సాయంత్రం పనుల మీద బయటకు వెళ్తారు. ఇంక తీరికగా తనతో బేరాలాడే తీరికెప్పుడు?–

అంచేత ఎండయినా, వానయినా, తిట్టినా, తరిమినా, గుడ్లురిమినా, 'ఏంటీ న్యూసెన్సు' అని విసుక్కున్నా – ఇవేవీ విశాల మనసును చేరవు. గీతలో కృష్ణ భగవానుడు చెప్పినట్లు ''మన డ్యూటీ మనం చేసుకుంటూ పోవాల... అంతే...'' అని తనకు తాను ధైర్యం చెప్పుకుంటుంది.

రోజుకు అయిదారొందల రూపాయల సరుకు అమ్మితే గాని గిట్టుబాటు కాదు. అంతవరకు ఆగదు విశాల... ఆగితే సాగదు మరి జీవన యానం... ఇంకో నాలుగు అడుగులు వేసింది.

ఇది బాగా ఉన్న వారిల్లులా ఉంది. కార్లు పోవటానికో పెద్దగేటు... మనుషులు పోవటానికి పక్కనే చిన్నగేటు... లోపల దారికి అటుఇటూ లాన్... పూల మొక్కలు... అంత దూరంలో పోర్టికో... దాని తర్వాత సినిమాలో సెట్టింగ్‌లాంటి అందమైన భవనం...

ఇంత పెద్దింటోళ్లు కొంటారా – అన్న అనుమానం ఉన్నా, బేరం తగులుతుందేమోనన్న ఆశతో, చిన్నగేటు తీసుకుని, బిక్కుబిక్కుమని చూస్తూ పోర్టికో దాకా వెళ్లింది.

ఇంతలో ఎటునుంచి వచ్చిందో తెలియదు. నల్లగా, ఇంతెత్తున మేకపోతులా ఉంది – కుక్క భౌభౌమని అరుస్తూ ఆమెను అడ్డగించింది. దాని అరుపు డీసెల్ రైలింజన్ కూతలా – గుండె లవిసేలా ఉంది.


విశాల 'అమ్మో, అమ్మో' అని అరుస్తూ వెనక్కి పరుగెత్తబోయింది. కానీ కుక్క ఎగిరొచ్చి వెనక రెండు కాళ్ల మీద నిలబడి ముందు రెండు కాళ్లతో ఆమెను నడుం దగ్గర పట్టుకుని, నోటితో చీరపట్టి లాగేస్తోంది. విశాల గుండె పగిలేలా భయంతో కేకలు పెడుతోంది.

రెండు మూడు నిముషాలు విశాలకూ, కుక్కకూ భీకరపోరు జరిగింది. ఆమె ఎటూ పోకుండా నిలేసింది కుక్క. 'చచ్చాన్రా దేవుడోయ్' అని విశాల

మొరపెట్టుకుంటోంది. ఆ మొర ఆ మూల సౌధంబులో, డ్రాయింగ్ రూంలో, సుతిమెత్తని సోఫాలా కూర్చుని, టీ.వీ.సీరియల్ డ్రామా వినోదియగు ఆ మేడమ్ విని, ఆపన్న ప్రసన్నురాలై, కాలి స్లిప్పర్స్‌ను ధరింపక, చేతిలోని రిమోట్‌ను విడిచి పెట్టక, చెదరిన జుట్టును సవరింపక, కుచోపరి చేలాంచనమైన సరిచేయక–

పోర్టికోలోకి వచ్చింది. జరిగిందేమిటో నిముషంలో గ్రహించి, వడివడిగా విశాలవైపు నడిచింది.

''సీజర్, గో బ్యాక్... ఐసీ... గో బ్యాక్...'' అని రెండు మూడుసార్లు ఆమె గర్జించాక కుక్క వినయ సంపదను కొని తెచ్చుకుని పులి లాంటి కుక్క పిల్లిలా మారి పక్కకు వెళ్లింది.



విశాలకు గుండెదడ తగ్గలేదు. కన్నీటిధారలు ఆగటం లేదు. ఆమె చేతిసంచీ కింద పడిపోయింది. సబ్బులన్నీ చెల్లా చెదురుగా పడిపోయాయి. కన్నీరు తుడుచుకుంటూనే సబ్బులన్నీ ఏరి సంచిలో వేసుకుంది.

''ఎవరు నువ్వు?'' అని అడిగింది మేడమ్ – ఆమె ఎవరో అర్థమవుతూనే ఉన్నా.

విశాలకు నోట మాట రావటం లేదు. నాలుక తడారి పోయింది. మంచినీళ్లు కావాలంటూ సంజ్ఞ చేసింది.

''నీళ్లు తెస్తా నుండు'' అంటూ ఆమె లోపలికి వెళ్లింది.

విశాల కుక్క చింపిన చీరపైటను చూసుకుని, మళ్లీ కన్నీరు నింపుకుంది. ఉన్నవే రెండు చీరలు...

విశాల కుక్క వంక చూసింది. అది ఇంకా కోపంగానే చూస్తోంది.

మేడమ్ మంచి నీళ్లు తెచ్చి ఇచ్చింది. గ్లాసు ఎత్తి నీళ్లు గొంతులో పోసుకుంది. రెండు మూడు గంటల నుంచి ఎండలో తిరిగి తిరిగి, ఇప్పుడు చల్లని నీడకొచ్చి చల్లని ఫ్రిజ్ వాటర్ తాగాక, విశాల కొంచెం తేరుకుంది.

''సబ్బులు అమ్ముతుంటావా?'' అని అడిగింది మేడమ్.

''అవును మేడమ్... కొత్తకంపెనీ... కొత్తగా మార్కెట్‌లోకి విడుదల చేసింది మేడమ్... ఇవి మామూలు సబ్బుల్లా చర్మానికి హాని చెయ్యవు మేడమ్... నిమ్మ, వేపలాంటి ఇంగ్రీడియంట్స్‌తో, మైసూర్ సాండిల్ లాంటి సువాసనతో – అసలు స్నానంచేశాక ఎంతో రిలీఫ్‌గా ఫీలవుతారు మేడమ్... ఆఫర్ కూడా ఉంది మేడమ్... రెండు కొంటే ఒకటి ఫ్రీ...'' అంటూ పైట కొంగుతో మొహం తుడుచుకుంటూ చీర చినుగువైపే దృష్టి నిలిపింది.

మేడమ్‌కు అర్థమైంది, విశాల చెప్పిన విషయమే కాదు, చెప్పని విషయం కూడా.

''కుక్కను ఎప్పుడూ కట్టేసి ఉంచుతాం... రామస్వామి ఎందుకో చెయిన్ విప్పినట్లున్నాడు...'' అన్నది మేడమ్.

''ఈ కుక్క ఏంటి మేడమ్... మేకలా అంత ఎత్తు ఉంది...'' అన్నది విశాల ఆశ్చర్యంగా.

''ఆయన కావాలని తీసుకొచ్చి పెంచుకుంటున్నారు... ఆయనకు చాలా ఇష్టం ఈ కుక్క అంటే...''

విశాల మళ్లీ అసలు విషయానికొచ్చింది ''సబ్బులు తీసుకుంటారా మేడమ్..'' అని అడిగింది.

తన వల్ల జరిగిన పొరపాటుకు ఆమె కొంచెం గిల్టీగా ఫీలవుతోంది. అందుచేత ఆమె దగ్గరున్న సబ్బులన్నీ కొంటానన్నది.

''అయిదొందల రూపాయల సరుకుంది మేడమ్..''

''తీసుకుంటాన్లే గాని, కాసేపు కూర్చో.... ఎండలో తిరిగి తిరిగి వచ్చావు...'' అన్నది మేడమ్.

ఆమె సోఫాలో కూర్చుంది. విశాల

కింద కూర్చుంది.

''సేల్స్‌గర్ల్స్‌ను చూస్తేనే అందరూ ఛా, ఛా అని తరిమి కొడతారు.. మీరు సిరి సంపదల్లోనే కాదు, మంచి తనంలోనూ రియల్లీ గ్రేట్ మేడమ్..'' అన్నది విశాల. సరుకు అంతా కొంటానని అన టంతో ఆమెకు చాలా ఆనందంగా ఉంది.

మేడమ్ నవ్వింది.

విశాల మళ్లీ అన్నది. ''మిమ్మల్ని చూస్తుంటే దేవతను చూసినంత ఆనందంగా ఉంది మేడమ్...''

ఆమె చిరునవ్వుతో అడిగింది ''రోజంతా ఇలా ఎండలో తిరగాలంటే కష్టం కదా...''

''ఏం చేస్తాం మేడమ్... రెక్కాడినా... డొక్కాడని బ్రతుకులు మావి...''

''పెళ్లి అయిందా?''

''అయిందా అంటే.. అయిందనే చెప్పాలి...''

''ఏం అతను నిన్ను వదిలేసాడా?''

''వదిలేశాడా అంటే.... పూర్తిగా వదిలెయ్య లేదు...''

''అతనేం చేస్తాడు?''

''చిట్ ఫండ్ కంపెనీలో పని చేస్తాడు మేడమ్... నాలుగేళ్ల కిందట ప్రేమిస్తున్నానంటూ నా వెంట పడ్డాడు... నేను పెళ్లి చేసుకోకపోతే చచ్చిపోతాన న్నాడు... అప్పుడా మాటలు సిన్సియర్‌గానే అన్నా డండి... మా కులం కాదు గనుక మా వాళ్లు ఒప్పుకో లేదు. ఒప్పుకున్నా ఒప్పుకోక పోయినా మా వాళ్లు నా పెళ్లి చేసే స్థితిలో లేరు. అందుకని మేం గుళ్లో పెళ్లి చేసుకున్నాం... కొన్నాళ్లు బాగానే గడిచింది. నేను తీసుకున్న నిర్ణయం మంచిదే నన్న నమ్మకంతో ఉన్నాను. ఏడాది కిందట వాళ్ల కంపెనీలో ఒక వగల మారి చేరింది. అది వల విసిరింది. ఆ వలలో పడి చేప లాగిలగిల్లాడి పోతున్నాడు...'' అని ఆగింది విశాల.

''అంటే రెండో పెళ్లి చేసుకున్నాడా?''

''దానికీ ఇంతకు ముందే పెళ్లి అయిందండి. దాని మొగుడో దగుల్బాజీ ఎదవండి... అదేమో వీడి డబ్బు అంతాలాగేసుకుంటోందండి. ఆ డబ్బు కోసం దాని మొగుడు కూడా ఈడ్ని ఎలౌ చేస్తా డండి. ఈడు ఇంక అక్కడే తిండి, పడకా - అంతా నండి... అసలు ఎవరికన్నా చెప్పటానికే చాలా చండాలంగా ఉంటుందండి...''

''ఊ.... బాగానే ఉంది...'' అని దీర్ఘంగా నిట్టూర్పు విడిచింది మేడమ్. ''ఏదన్నా నీడ పట్టున షాపుల్లో ఎక్కడన్నా సేల్సు గర్ల్ అయితే ఇంత కష్టం ఉండదు కదా...'' అనీ అన్నది.

''పెద్ద పెద్ద షోరూంలోనే చేశానండి... కానీ మొగుడు వదిలేశాడని అంటే అందరికీ చులకన అండి. ప్రతోడూ ఆడికోసమే నేను ఎదురు చూస్తు న్నట్లు ఫీలయిపోతాడండి. సినిమా కెళ్దామా, హోటలు కెళ్దామా - అని అడిగేవాడేనండి. ఒకడితో మాట్లాడితే ఇంకోడికి కడుపు మంట - అక్కడికి నేనేదో వాడి సొంతమైనట్టు - వీడు కానొట్టు - వాడికి అన్యాయం చేసినట్టు... వీడినేదో వరిం చేసి నట్టు - వెధవ పాలిటిక్స్ అండీ... రోజూ వంద కంప్లయింట్స్ చేసే వారండీ... నా మీద... ఒక స్టేజీలో చచ్చిపోదామనుకున్నానండి...'' అని ఆగింది విశాల.

''ప్రతి సమస్యకూ చావే పరిష్కారమా?'' అని అడిగింది.

''పరిష్కారం అందరికీ ఒకలా ఉండదండి... డబ్బున్న వాడు, అధికారంలో ఉన్న వాడు, పలుకు బడి గల వాడు - చావటానికి చస్తే ఒప్పుకోడండి. చివరకు దేవుడు రాసిన నుదుటి రాతను కూడా చెరి పెయ్యటానికి, అమెరికా వెళ్లి వైద్యం చేయించుకుం టాడండి. కాని లేని వాడి సమస్యకు పరిష్కారం లేదండి. కుక్కలాగా, నక్కలాగా బతకటం కన్నా చావే నయం అనుకుంటాడండి. నాది అని చెప్పుకో వటానికి ఇల్లు లేదు, వాకిలి లేదు. పొలం లేదు. పుట్ర లేదు.... పైగా ఆకలి... ఆకలితో మాడే వాడికి మంచీ, చెడూ, నీతీనియమం - ఇవేవీ ఉండ వండి... ఇప్పుడు పశువులున్నాయనుకోండి... ఆక లేస్తే, ఎక్కడ గడ్డి అంటే, అక్కడి కెళ్లి మేస్తయి... అంతేగాని, ఇది మన పొలం కాదని పక్కకు తొలగి పోవుకదండి. కడుపు కాలే మనిషి అంతేనండి... ఇప్పుడింత మంది మానవబాంబుల కింద ఎందుకు తయారవుతున్నారండి... ఒకసారి వాళ్ల పొజిషన్‌లో ఉండి ఆలోచించండి... పేదరికం, నిర క్షరాస్యత... వాడికి ఆ రోజు తిండి దొరికితే చాలు... పైగా తను చచ్చినా ఫర్వాలేదు... తన కుటుంబా నికి కొన్ని లక్షలు డబ్బు ముడుతుంది... వాళ్ల అయినా సుఖ పడతారని, వీడు చావటానికి సిద్ధప డుతున్నాడు... నిన్న టీవీ న్యైన్‌లో చెబుతున్నా రండి... పాకిస్తాన్‌లో కొన్ని వేలమంది యువకులు మానవ బాంబులుగా మారటానికి సిద్ధంగా ఉన్నా రంటూ... ఇంకేమార్గమూ లేనప్పుడు దుర్మార్గమే కదండీ... మేడమ్'' చిరునవ్వుతో అడిగింది.

''నువ్వేం చదువుకున్నావ్?''

''నేనాండి. టెంత్ ఫెయిలండి... చదువు కోలే దండి... కానీ ప్రతి ఆదివారం మా ఇంటి దగ్గర గుళ్లో కెళ్తానండి. అక్కడ రిటైరైనోళ్లు రోజూ చేరి ఇయ్యే కబుర్లండి... ఆళ్ల అన్న దాంట్లో నిజం ఉంద నిపిస్తందండి...''

''సరే గానీ... ఇప్పుడు నీ పరిస్థితి ఏంటి?''

''ఒక ప్లాన్ ప్రకారం చదువుకుని, ఉద్యోగాలు చేసుకుని, కోరిన వాళ్లను చేసుకుని - పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునేంత గొప్పవాళ్లం కాదండి... పరిస్థితులు మమ్మల్ని ఎటు నెట్టుకెళ్తే, అటు గాలికి కొట్టుకు పోవటమేనండి...''

''మీ ఆయన వస్తే రానిస్తావా?''

''వస్తాడండి... ఎప్పుడొస్తాడంటే, అది పూర్తిగా వీడిచేత తలకు మించిన అప్పులు చేయించి, ఆ అప్పు లాళ్లు వీడి జీతం లాగేసుకుంటుంటే, ఈ గుడ్డి గుర్రా నికి అది మేత ఎందుకేస్తుందండి? తన్ని తరిమివేస్తుం దండి. అప్పుడు పెళ్లాం ఎక్కడుందో ఎతుక్కుంటూ వస్తాడండి... కానీ అప్పుడు ఆ అప్పుల ఊబిలో నుంచి లాగటం నా వల్ల ఏమయితది?'' అని రాబోయే పరిస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించింది.

''పోనీ ఇప్పుడొస్తే రానిస్తావా?''

''మనస్ఫూర్తిగా రానియ్యటం ఉండదండి. కాక పోతే నాకు జరుగుబాటు లేదు కాబట్టి... ఉండ నిస్తానంతే...'' అన్నది విశాల.

మేడమ్ విశాల మొగుడు పనిచేసే చిట్ ఫండ్ కంపెనీ పేరు, అతని పేరు అడిగింది.

ఫోన్ తీసుకుంది. ఆ ఏరియా డి.ఎస్.పి.కి ఫోన్ చేసింది.

''నేను భుజంగరావు గారి మిసెస్ ప్రభావతి మాట్లాడుతున్నాను...''

''నమస్తే మేడమ్... ఎలా ఉన్నారు?''


''ఫైన్... మీ మిసెస్ ఎలా ఉన్నారు?''

''అంతా బాగానే ఉన్నాం... ఒకసారి మా ఇంటికి రండి మేడమ్... చాలా రోజులైంది.''

''తప్పకుండా వస్తాను.... డాలీని చూసి చాలా రోజులైంది... ఏం లేదు... ఒక్క చిన్న రిక్వెస్టు...''

''చెప్పండి మేడమ్...''

''మీ ఏరియాలో ఉన్న చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేసే ఒకతను ఒక అమ్మాయిని ప్రేమించానని



వెంటపడి పెళ్లి చేసుకున్నాడు. కొన్నాళ్లు కాపరం చేశారు. ఇప్పుడ తను ఆ అమ్మాయిని వదిలేసి, అదే కంపెనీలో పని చేసే అమ్మాయితో ఉంటున్నాడు...''

డి.ఎస్.పి. నవ్వాడు. ''ఇప్పుడు మాకు అన్నీ ఈ కేసులే ఎక్కువై పోతున్నాయి మేడమ్...''

''దీనికి కారణం ఎవడి స్వార్థం వాడు చూసుకుంటూ, కట్టుబాట్లు లేకుండా వ్యవహరించటం...''

''ఒకే.. అతని పేరు, ఆ కంపెనీ పేరు చెప్పండి... నేనిప్పుడే పిలిపించి ఒక డోస్ ఇస్తాను... దారి కొస్తాడు...'' అన్నాడు డి.ఎస్.పి.

ఆమె వివరాలు చెప్పింది. ఆయన నోట్ చేసుకున్నాడు.

మేడమ్ విశాలతో అన్నది. ''నేను ఆ ఏరియా డి.ఎస్.పి.తో మాట్లాడాను. ఆయన మీ ఆయన్ను, అవసరమైతే ఆ అమ్మాయిని, ఇంకా అవసరమనుకుంటే ఆ కంపెనీ మేనేజ్‌మెంట్‌తోనూ మాట్లాడతాడు. ఐ థింక్... యువర్ ప్రాబ్లమ్ విల్ బి సాల్వ్‌డ్...''

విశాల జలజలమని కన్నీరు కారుస్తూ వెళ్లి ఆమె కాళ్ల మీద పడింది.

''లే...లే...'' అన్నదామె.

''అరగంట కిందటి వరకు నేనెవరో మీకు తెలియదు... ఈ కాసేపట్లో నా విషయాలు తెల్సుకుని, నా జీవితాన్ని ఒక క్రమ పద్ధతిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు... మీ రుణం తీర్చుకోవటానికి, మీ కివ్వటానికి నా దగ్గర ఏమున్నది... కృతజ్ఞత తప్ప...'' అన్నది విశాల.

''మన పరిచయం... ఫోన్ చెయ్యటం ఇదంతా యాధృచ్ఛికం. జస్ట్ యాక్సిడెంటల్... కానీ ఈ సమాజం ఏమైపోతోంది? ఎక్కడికక్కడ, ఎవడికి వాడు, ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ, నీతి నియమం, న్యాయం ధర్మం – అన్నీ వదిలేసుకుని తిరిగే, వాట్ విల్ హేపెన్ టు ది సోషల్ ఫాబ్రిక్...'' ఊరుకోనివ్వటం లేదు.

విశాలకు రెండు చీరలు కూడా ఇచ్చింది – అయిదొందలతో పాటు.

''ఇంకా ఏదన్నా ప్రాబ్లం ఉంటే, డి.ఎస్.పిని కల్సి నా పేరు చెప్పు...'' అన్నది.

విశాల మరీ మరీ కృతజ్ఞతలు చెప్పుకుంది. వెళ్తూవెళ్తూ మేకపోతులా ఉన్న నల్ల కుక్క వంక చూసింది. అది గుర్రుగా చూసింది.

ఆ రోజు రాత్రి విశాల ఇంటికెళ్లేటప్పటికి, ఆమె మొగుడు పద్మనాభం అక్కడున్నాడు.

''నా మీద పోలీసు కంప్లయింట్ ఇచ్చావా?'' అని అడిగాడు కోపంగా.

''ఇచ్చాను'' అన్నది విశాల ఎడమొహంతో.

''అది చిట్‌ఫండ్ కంపెనీ... రోజూ ఎంతోమంది కష్టమర్లు వస్తుంటారు. మా కోసం పోలీసులు తిరుగుతున్నారని తెలిస్తే, మా బిజినెస్ ఏమవుతుందో ఆలోచించావా?'' అని అరిచాడు.

''నేను నా గురించి మాత్రమే ఆలోచిస్తాను. బిజినెస్ చేసే వాళ్లు దాని గురించి ఆలోచిస్తారు. నాకెందుకు అవన్నీ...''

''అయితే ఏమిటంటావ్?''

''నేను ఏమీ అనటం లేదు... నా బతుకేదో నేను బతుకుతున్నాను... అంతే...''

''మరి పోలీసు కంప్లయింట్ ఎందుకిచ్చావు?''

''నన్ను పెళ్లి చేసుకున్నావు. ఆరు నెలల నుంచి నా మొహం చూడడం లేదు. ఇది మోసం కదా...'' అన్నది విశాల.

పద్మనాభం చల్లబడ్డాడు. ఆమె ఒక్కతే అన్నం తిన్నది. అతను బయటకెళ్లి తినేసి వచ్చాడు.

పదింటికి దీపం ఆర్పేసింది. పడుకున్నారు. పద్మనాభం విశాల మీద చెయ్యి వేశాడు. ఆమె విసిరి కొట్టింది. ఆ చేతిని వెళ్లి గోడకు కొట్టుకుంది. అతను అటు తిరిగి పడుకున్నాడు.

మర్నాటి నుంచి మౌనంగానే సాగిపోయింది వాళ్ల సహజీవనం.

రెండు నెలలు గడిచాయి. ఇప్పుడు కొంచెం గాడిలో పడింది. పద్మనాభం విశాలను ప్రేమగానే చూసుకుంటున్నాడు. ఆమె కూడా క్రమంగా గతాన్ని మర్చిపోయింది.

తన జీవితం ఒక గాడిలో పడినందుకు విశాల మేడమ్‌కు కృతజ్ఞత చెప్పుకోవాలనుకుంది. మళ్లీ ఆమెకు కనపడక పోతే, అది కృతఘ్నతే అవుతుంది – అనుకుంటూ ఆమె ఇంటికి వెళ్లింది.

ఇప్పుడా గేటు మీద 'కుక్క ఉన్నది జాగర్త' అన్న బోర్డు తగిలించి ఉంది.

కుక్క ఎక్కడ మీద పడుతుందో నన్న భయంతో గేటు దగ్గరే ఆగింది. లోపల కారు ఆగి ఉంది. డ్రైవరు, పని మనుషులు తిరుగుతున్నారు. కుక్కను కట్టేశారు.

విశాల లోపలికి వెళ్లింది. ''అమ్మగారు కావాలి'' అని అడిగింది. నౌకరు లోపలకు వెళ్లమన్నాడు.

అయిదు నిముషాలు గుమ్మంలో నిలబడ్డది. మేడ మీద గదిలో నుంచి అరుపులు విన పడుతున్నాయి. దేనికో ఘర్షణ పడుతున్నట్లున్నారు.

కాసేపటికి ఆయన కిందకు వచ్చాడు. కారులో కూర్చున్నాడు. కారు వెళ్లిపోయింది.

మరో పది నిముషాల తర్వాత మేడమ్ కిందకి వచ్చింది. ఏడ్చినట్టుంది. కళ్ల వెంట ఇంకా నీళ్లు కారుతున్నాయి. విశాలను చూసి మొహం తుడుచుకుంది.

''ఏం? ఎలా ఉన్నావు?'' అని అడిగింది.

''తమ దయవల్ల బాగానే ఉన్నానమ్మా... ఇప్పుడు వాడు నా దగ్గరే ఉంటున్నాడు. జీతం డబ్బులు నాకే ఇస్తున్నాడు. ఇబ్బంది లేకుండా జరిగిపోతోంది. ఇదంతా మీ దయ...'' అని దణ్ణం పెట్టింది.

మేడమ్ మాట్లాడలేదు. ఆమె మొహం మీద విచారం కారు మబ్బులా కమ్ముకుని ఉంది.

''అలా ఉన్నారేమమ్మా... ఒంట్లో బాగో లేదా?'' అని అడిగింది విశాల.

''ఒంట్లో బాగానే ఉంది. ఇంట్లోనే బాగా లేదు. ఈ మగవెధవల బుద్ధే అంత... పరాయి ఆడది దొరికితే పరమాణ్ణం దొరికినంత సంబరం.... ఏముంది ఎవతె దగ్గర మాత్రం... ఇన్ని ఎముకల గూడు... ఇన్ని మాంసంముద్దలు... ఈ మాత్రం దానికి వెధవలు చిత్తకార్తె కుక్కలా పరిగెడతారు...

మా ఇంట్లోనూ తగలడిందో కుక్క...'' అంటూ ఆమె వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంది.

బయట నుంచి కుక్క అరుపు వినిపిస్తోంది.

*



## అసిన్‌కు నచ్చని సినిమా టైటిల్....?

హిందీలో 'గజిని' హిట్ తర్వాత అసిన్ బాలీవుడ్‌లో బిజీ బిజీ అయిపోయింది. బాలీవుడ్‌లో అసిన్ నటిస్తున్న రెండు చిత్రాల నిర్మాణం శరవేగంతో జరుగుతుండడంతో మిగతా చిత్రాలకు డేట్స్ కుదరక ఒప్పుకోనట్లు వార్త. ఈ నేపథ్యంలో డిస్నీ పిక్చర్స్ వారి సినిమాను అంగీకరించలేదని తెలిసింది. అయితే డిస్నీ పిక్చర్స్ వారు ఇస్తామన్న పారితోషికం చాలకనే అసిన్ ఆ సినిమాను వదులుకుందని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. రెమ్యునరేషన్‌తో పాటు సినిమా టైటిల్ కూడా అసిన్‌కి నచ్చలేదట! అందుకే ఆ సినిమాను వదులుకుందని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. ఏదిఏమైనా బాలీవుడ్‌లో అసిన్ హవా నడుస్తోందన్నది మాత్రం నిజం.